## మంచి వార్త

# గౌర్‌ను కాపాడుకొందాం



గౌర్ (అడవి బర్రె, అడవి దున్న) భారతదేశపు అడవులకు తలమానికమైన పశువు. సుమారు ఒకటిన్నర మీటర్లకుపైగా ఎత్తయిన శరీరంతో వంపులు తిరిగిన కొమ్ములతో నలుపు, బూడిద రంగుల మిశ్రమంతో గౌర్ చూసేవారిని ఇట్టే ఆకట్టుకుంటుంది. అంతేకాదు ఇది అడవిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. మనదేశంలో పశ్చిమ కనుమలు, ఛత్తీస్‌గఢ్ అడవులు, తెలంగాణ సహా ఇతర దక్షిణ భారతదేశ పర్వత ప్రాంతాల్లో ఇవి కనిపిస్తాయి. బాస్ గౌరస్ దీని శాస్త్రీయనామం. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమాఖ్య (ఐయూసీఎన్) గౌర్‌ను వల్నరబుల్ వన్యప్రాణుల జాబితాలో చేర్చింది. అంటే తగిన సంరక్షణ చర్యలు తీసుకోకపోతే సమీప భవిష్యత్తులో కనుమరుగై పోతుందని అర్థం. ఇక దీని శరీరం, ఆహారపు అలవాట్లు అటవీభూములకు జీవకళ తెచ్చిపెట్టడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. 700 కిలోల నుంచి 1500 కిలోల వరకు బరువు తూగే గౌర్‌లు అడవుల్లో పెరిగే వివిధ రకాలైన గడ్డిని మేస్తాయి. అలా ఏ ఒక్క జాతి గడ్డి మాత్రమే అడవుల్లో విపరీతంగా పెరిగిపోకుండా అడ్డుకట్ట వేస్తాయి. అటవీ ఆవరణ వ్యవస్థను సమతూకంలో ఉంచుతాయి. అంతేకాదు ఇవి అడవిలో పోషణ చక్రం సవ్యంగా కొనసాగేలా చేస్తాయి. వీటి పేడలో నేలకు అవసరమైన పోషకాలు ఎన్నో ఉంటాయి. ఇవి చెట్లు ఏపుగా పెరగడానికి, దాన్ని ఆశ్రయించుకుని జీవించే కీటకాలు, పక్షులు మొదలుకుని, గౌర్‌లనే ఆహారంగా తీసుకునే పులుల్లాంటి ఉన్నతస్థాయి మాంసాహార జంతువుల బతుకులకూ భరోసా ఇస్తున్నాయి. పండ్లను ఆహారంగా తీసుకునే గౌర్‌లు ఆయా రకాల చెట్ల విత్తనాలు వేరే ప్రాంతాలకు విస్తరించడానికి సహాయపడుతున్నాయి. అయితే, అడవిని సంరక్షించడంలో ఇంతటి ప్రాధాన్యం ఉన్న గౌర్ తనను తాను కాపాడుకోలేక పోతుండటం శోచనీయం. అడవుల నరికివేత, అడవులను మనుషులు ఆక్రమించడం మొదలైన కారణాల వల్ల వీటి ఆవాసాలు విధ్వంసానికి గురవుతున్నాయి. దీంతో గౌర్‌ల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నది. ఇది పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నది. ఈ పరిస్థితుల్లో గౌర్‌ను కాపాడుకోవడం అంటే భారతదేశపు అడవులను కాపాడుకోవడమే అని గుర్తెరగాలి. గౌర్ అంటే అడవిలో ఉండే ఒకనొక ప్రాణి మాత్రమే కాదు.. అడవిని సంరక్షించేది కూడా!

## వైతాళికుల వాణి

ప్రస్తుతం మనం భవిష్యత్తును దోచుకుంటున్నాం. దాన్ని వర్తమానంలో అమ్మేస్తున్నాం. దీన్నే స్థూల దేశీయ ఉత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) అని పిలుచుకుంటున్నాం.

• **పాల్ హాకెన్**

(పర్యావరణవేత్త)

## క్యా సీన్ హై!

